బకాయిలే..బకాయిలు

- టాప్ టెన్ బకాయిలు @ రూ.203 కోట్లు
- నిమ్స్ దవాఖాన బకాయి రూ.53 కోట్లు
- వంద మందికి రెడ్ నోటీసులు
- పది మందికి వారెంట్లు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 21 : జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలో మొండి బకాయిలు రికార్డు స్థాయిలో పేరుకుపోయాయి. అధికారులు ప్రజలకు ఆస్తి పన్నులపై అనేక రకాలుగా ప్రచారాలు నిర్వహిస్తూ....ఎర్లీబర్డ్ లాంటి బంపర్ ఆఫర్లను సైతం ప్రకటించింది. కాని కొందరు పన్నుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగస్తుండడంతో అధికారులు ఆస్తి పన్నుల బకాయిలు వసూలు చేసేందుకు కార్యాచరణలో దిగారు. సమయం తక్కువ ఉండడంతో వసూళ్లు చేసేందుకు అధికారులు, సిబ్బంది చెమటోడ్చుతున్నారు. అసలే సిబ్బంది అంతంత మాత్రమే ఉండడంతో వసూళ్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపులు ఉన్నా వాటిని కొందరు మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. మరికొందరు ఉద్దేశపూర్వకంగా ఏండ్ల తరబడి పన్నులు ఎగ్గొడుతున్నారు.

జంట సర్కిళ్లల్లో రూ. 203 కోట్లకు పైగా బకాయిలు

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో ఆస్తిపన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. రికార్డు స్థాయిలో బకాయిలు ఉండడంతో వాటి వసూళ్లు చేసేందుకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కొందరు పెద్దలు పేర్లు చెబుతూ తప్పించుకుంటుండగా, మరికొందరు పన్నులు చెల్లించకుండా లైట్ తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- జీహెచ్ఎంసీకి రావాల్సిన టాప్‌టెన్ బకాయిలు ఖైరతాబాద్ (సర్కిల్ 17), జూబీహిల్స్ (సర్కిల్ 18) కలిపి సుమారు రూ. 203,51,21,410 ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.
- నిమ్స్ దవాఖాన రూ. 54కోట్లు ఉండగా, సంవత్సరానికి కొంత చెల్లిస్తూ వస్తున్నారు.
- సంవత్సరాల తరబడి కత్రియా హోటల్ బకాయిలు చెల్లించకపోవడంతో రూ.8కోట్ల వరకు పేరుకుపోయిందని జీహెచ్ఎంసీ సర్కిల్ 17 డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి తెలిపారు.
- ఇదిలా ఉండగా, రూ.5లక్షలకు పైగా ఉన్న వారి జాబితాను పరిశీలిస్తే కండ్లు బైర్లు కమ్మే బకాయిలు ఉన్నట్లు తెలిసింది.
- ఖైరతాబాద్‌లో రూ.474.44 కోట్లు, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో రూ.393.85 కోట్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

తాజ్ బంజారా ఘటనలో చెల్లింపుల్లో జోరు

- జీహెచ్ఎంసీ ఆస్తి పన్నులు కట్టకుండా తాత్సారం చేస్తున్న బంజారాహిల్స్‌లోని తాజ్‌బంజారా హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. దీంతో వారు దిగి వచ్చి కొంత చెల్లించారు. దాని ప్రభావంతో మొండి బకాయిదారులు ఆస్తి పన్నులు కట్టేందుకు బారులు తీరుతున్నట్లు అధికారులు తెలిపారు. రూ.203 కోట్లలో శుక్రవారం సాయంత్రం వరకు సుమారు రూ.108కోట్లు చెల్లింపులు జరిగాయని చెబుతున్నారు.
- అయితే ఇప్పటికే వంద మంది మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు, పది మందికి వారెంట్లు జారీ చేశామన్నారు.

ఖైరతాబాద్ సర్కిల్...

నిమ్స్ హాస్పిటల్ రూ.53 కోట్లు, హెచ్ఎండీఏ మైదానం(ఐమాక్స్ పక్కన) రూ.41 కోట్లు, టీఎస్‌డీ బిల్డింగ్ రూ.20కోట్లు, రెస్క్యూ హోం అండ్ అలైడ్ బిల్డింగ్ రూ.17కోట్లు, సర్వీస్ హోం రూ.12కోట్లు, సీఆర్‌వో బ్లాక్ రూ.9కోట్లు, హైదరాబాద్ బాట్లిక్ కో రూ.8.73కోట్లు, శ్రీలక్ష్మీ గాయత్రి హోటల్స్ రూ.8.62కోట్లు, స్వీటీ బిల్డర్స్ రూ.8.46కోట్లు.

జూబ్లీహిల్స్ సర్కిల్...

జూబ్లీహిల్స్ ల్యాండ్ మార్క్ ప్రాజెక్ట్స్ రూ.52కోట్లు, ఎల్ అండ్‌టీ మెట్రో రైల్ రూ.32 కోట్లు, హైదరాబాద్ అస్‌బెస్టాస్ సిమెంట్ ప్రో రూ.30కోట్లు, అప్పా రూ. 29కోట్లు, కృపాదేవి రూ.12కోట్లు, సందేశ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితరులు రూ.7.66కోట్లు, ఇండో అరబ్ లీగ్ రూ.7.33కోట్లు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ రూ.5.55 కోట్లు, ఉషారాణి రూ.3.84 కోట్లు, సయ్యద్ హుస్సేన్ ఆస్కారి రూ.3.82 కోట్లు ఉన్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నారు.

స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోండి

బండ్లగూడ, ఫిబ్రవరి 21: బైరాగిగూడా ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ శరత్ చంద్రను కలిసి స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైరాగిగూడా ప్రభుత్వ పాఠశాలకు ఓ స్వచ్ఛత సంస్థ ప్రహరీ కూడా నిర్మించిందని తెలిపారు. కాగా గత రాత్రి ప్రహరీ గోడ పూర్తిస్థాయిలో కుప్పకూలిందని తెలిపారు.

విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు వెంటనే ప్రహరీ గోడ నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరమ్మ, నాయకులు పూలపల్లి కృష్ణారెడ్డి, శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, మదర్‌పలి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 21: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐడీఏ మైలార్‌దేవ్‌పల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 గంటల నుంచి 12 గంటల వరకు సుభాన్ కాలనీ ఫేస్-1,2, మిలాన్ కాలనీ, రహమత్ కాలనీ పార్ట్, దస్తగిరి నగర్, హషామాబాద్, రాజీవ్‌గాంధీనగర్, పటేల్‌నగర్, అబ్దుల్లా కాలనీ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోతలు ఉంటాయన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

డీసీపీ ఆకస్మిక తనిఖీ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 21: పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం పశ్చిమ మండల డీసీపీ విజయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల చోటు చేసుకున్న వరుస ఘటనల నేపథ్యంలో ఆయన తనిఖీ చేపటినట్లు తెలిసింది. పంజాగుట్టలో ఓ పారిశ్రామికవేత్త హత్య, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫేక్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కమాండ్ కంట్రోల్ భవనంలోకి వెళ్లి వచ్చినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పోలీసులకు దిశా నిర్ధేశం చేసేందుకు ఆయన తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.

పోలీసు స్టేషన్‌లోని ఫైళ్లను పరిశీలించడంతో పాటు పీఎస్ వెనుక వైపు భారీగా పేరుకుపోయిన సీజ్ చేసిన వాహనాలను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది.

డబ్బులు, సమయం వృథా చేసుకోకుండా..

అత్తాపూర్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రారంభం

శిక్షణ పొందిన సభ్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ సి.హెచ్.పంచాక్షరి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 21: కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ల ద్వారా డబ్బులు, సమయం వృథా చేసుకోకుండా కేసులను పరిష్కరించవచ్చునని రంగారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ సి.హెచ్.పంచాక్షరి తెలిపారు. అత్తాపూర్ వాసుదేవారెడ్డినగర్ కాలనీలో శుక్రవారం నూతనంగా నాంపల్లి శ్రీకాంత్, శంకర్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ప్రజలకు వివిధ సమస్యలపై ఇక్కడ పరిష్కరించుకోవటానికి అనుకూలంగా ఉంటుందన్నారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌లో అనుసరించాల్సిన విధివిధానాలపై మూడు రోజుల పాటు శిక్షణ పొందిన 15 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ లీగల్ సర్వీసెస్ అథార్టీ ఏవో సీనియర్ జడ్జి కళార్చన, రంగారెడ్డి జిల్లా డీఎల్ఎస్ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై, ట్రైనింగ్ పొందిన మీడియేషన్ సెంటర్ సభ్యులు రామారావు, సురేష్‌తో పాటు ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీఈడీ, ఎంఈడీ వన్ టైం చాన్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీఈడీ, ఎంఈడీ కోర్సుల వన్ టైం పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (ఇయర్ వైజ్), బీఈడీ (సెమిస్టర్ వైజ్), ఎంఈడీ (సెమిస్టర్ వైజ్) వన్ టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల ఆరవ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

తాజ్ కృష్ణలో ఆసియా జువెల్స్ షో

ఆసియా జువెల్స్ షో 2025 ను హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణలో ఫిబ్రవరి 21,22,23 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు టాలీవుడు ప్రముఖులు తేజస్వి మడివాడ, రాశి సింగ్, కామాక్షి భాస్కర్ల హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.
-సిటీ బ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ):

నేటి నుంచి జీహెచ్ఎంసీ కార్యాలయంలో.. ఆస్తిపన్ను పరిష్కార వేదిక

బండ్లగూడ, ఫిబ్రవరి 21: రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను పరిష్కార వేదిక శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఉప కమిషనర్ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరానికి కాస్త పన్ను చెల్లించడంలో ఏవైనా అసమానతలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అసెస్మెంట్ సమస్యలు , ఆస్తి పన్ను చెల్లించడంలో ఎలాంటి సందేహాలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మార్చి 28వరకు ప్రతి శనివారం ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాష్ట్ర పన్ను పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో.. బ్రౌన్జ్ పతకం

ఖేలో ఇండియా స్టేట్ మీట్ ఉషా ఉమెన్స్ లీగ్-2025లో మైలార్‌దేవ్‌పల్లిలోని మహావీర్ మార్షల్ ఆర్ట్స్ ఉషా అకాడమీ విద్యార్థిని సత్తా చాటింది. ఆదిలాబాద్‌లోని ప్రియదర్శిని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 19న జరిగిన రాష్ట్రస్థాయి కాంపిటిషన్‌లో బుర్ర కీర్తి అండర్-17 పోటీల్లో బ్రౌన్జ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం పాలమాకుల తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రజిని విద్యార్థినిని అభినందించి సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ సంతోష్‌యాదవ్, పి.డి.రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 21

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి

హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న స్టాలిన్

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 21: దేశంలో నూతన విద్యా విధానం పేరుతో విద్యను కాషాయీకరణ, కార్పొరేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్. స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు , ఫీజురీయింబర్స్ మెంట్ మంజూరు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతుందని మండిపడ్డారు. ముందస్తుగా అడ్మిషన్లు తీసుకునే ప్రైవేట్,కార్పొరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నేతలు రామకృష్ణ,గ్యార నరేష్, రాఘురాం, గ్యార క్రాంతి, రేహమాన్, చిట్యాల రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: వివిధ సైకాలజీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫిల్ ఇన్ క్లినికల్ సైకాలజీ, ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, పీఎస్సై క్లినికల్ సైకాలజీ మొదటి సంవత్సరం రెగ్యులర్, ప్రొఫెషనల్ డిప్లమా ఇన్ క్లినికల్ సైకాలజీ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 7వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 12వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. inలో చూసుకోవాలని సూచించారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్‌లో మార్పు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్డీ ప్రవేశ ప్రక్రియ నోటిఫికేషన్ లో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఓయూ పరిపాలన భవనంలోని వైస్ ఛాన్సలర్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో ఈ మార్పులు తప్పనిసరిగా చేయాలని కోరారు. 65 ఏళ్లు నుండి వరకు గైడ్ షిప్ ఇవ్వాలని అన్నారు. రిటైర్ అయిన ప్రొఫెసర్లకు సైతం గైడ్ షిప్ అవకాశం కల్పించాలని కోరారు. పీహెచ్డీ సీట్ల సంఖ్యను కూడా పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. వివిధ రీసెర్చ్ సెంటర్లు, పీజీ సెంటర్ల రిటైర్డ్ ప్రొఫెసర్లకు సైతం గైడ్ షిప్ ను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రవేశ పరీక్షలో ర్యాంకు విధానాన్ని ఎత్తివేసి అర్హత సాధించిన అందర్నీ ఇంటర్వ్యూకు పిలవాలని డిమాండ్ చేశారు.

1,2 తేదీల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 21: దేశంలోని యువకుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న తీరుపై చర్చించేందుకు మార్చి 1,2 తేదీల్లో మేడ్చల్ జిల్లా, ఈసీఐఎల్‌లోని లయన్స్ క్లబ్ హాల్‌లో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర తెలిపారు. ఈ సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతికత, అభివృద్ధి, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై చర్చించి భవిష్యత్‌లో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్, నేత కల్యాణ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉండొద్దు

బేగంపేట్, ఫిబ్రవరి 21: రోడ్లపై రాకపోకలు సాగించే ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కల్పించకుండా తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫుట్‌పాత్ వ్యాపారులకు సూచించారు. రాంగోపాల్‌పేట డివిజన్‌లోని అంజలి థియేటర్, చిత్ర దర్గా పరిసరాలలో ఫుట్‌పాత్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలను ట్రాఫిక్ పోలీసులు కొద్దిరోజుల క్రితం తొలగించారు.

దీంతో వారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి తమ జీవనోపాధి లేకుండా చేస్తే తమ కుటుంబాలు వీధినపడతాయని వారు తమ ఆవేదనను విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తలసాని జీహెచ్ఎంసీ అధికారులతో పలుమార్లు సమావేశమై ఫుట్‌పాత్ వ్యాపారుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. వారిని ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పర్యటించి పరిస్థితులను తెలుసుకున్నారు.

ఉపాధి రికార్డుల్లో అవకతవకలు లేకుండా చూసుకోవాలి

పంచాయతీ కార్యదర్శులతో డీఆర్‌డీవో ఎల్ .శ్రీలత

మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో ఎల్, శ్రీలత, తదితరులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం రికార్డుల్లో పొరపాట్లు లేకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డీఆర్డీవో ఎల్ శ్రీలత సూచించారు. శుక్రవారం శంషాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మాట్లాడుతూ శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో 1.4.2023 నుంచి 31.4.2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై మండల స్థాయిలో బహిరంగా తనిఖీలు చేశామని వివరించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు తయారు చేసిన రికార్డులు మొత్తం మండలానికి వచ్చిన నిధులు వాటిని సంబంధించిన పనులు ఎంతమంది కూలీలు అనే అంశాలపై పూర్తి స్థాయిలో పరిశీలించామన్నారు. అయితే రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లు జరగలేదన్నారు.ఇదిలాఉంటే రికార్డులలో మాత్రం పూర్తిస్థాయిలో ఎందుకు లేదని వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శులు ఇతర మండలాలకు బదిలీపై వెళ్లడంతో కొన్ని రికార్డులు పూర్తిస్థాయిలో చేయలేదని వివరించారు.

సమావేశంలో ఏపీడీ నరేందర్, ఏవీవో కొండయ్య, ఎంపీడీవో మున్ని, ఎంపీవో ఉషకిరణ్, ఉపాధి హామీ అధికారులు అనిత, ప్రవీణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

నేటి యువత జంక్ ఫుడ్‌లతో పోషకాలతో కూడుకున్న సంప్రదాయ వంటకాలను మర్చిపోతున్న తరుణంలో ఇలాంటి ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం సంతోషకరమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తెలిపారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ హిమబిందు ఆధ్వర్యంలో విద్యార్థులు సంప్రదాయ వంటకాలను తయారు చేసి ఫెస్టివల్ నిర్వహించారు. ఫెస్టివల్‌కు ముఖ్యఅతిథిగా పాల్గొని వాటిని పరిశీలించారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇలాంటి సంప్రదాయ వంటకాలు తయారు చేయడంతో పాటు ప్రదర్శించడం మంచి ఆలోచన అని అభినందించారు.ఇలాంటి సామాజిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులు నిత్యజీవనంలో ఉపయోగపడే విధంగా అధ్యాపకులు ప్రోత్సహించడం అద్భుతంగా ఉందన్నారు. కళాశాల ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు పూర్తికాక ముందే 361 మంది విద్యార్థులు కళాశాలకు వస్తున్నారంటే అధ్యాపకుల బోధనతో పాటు వారికి ప్రోత్సాహం అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సామ రవీందర్ రెడ్డి,భానుప్రకాశ్,దుర్గాభవానీ, మాజీ మున్సిపల్ వైస్‌పర్సన్ సుష్మారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్,మాజీ కౌన్సిలర్లు జాంగీర్‌ఖాన్, రేఖాగుప్త,అజెయ్, సంజయ్‌యాదవ్, మురళియాదవ్‌లతో పాటు పలువురు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.
- శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 21

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా..

మాతృభాష, మన సంస్కృతి, సంప్రదాయాలు భావి తరాలకు వారసత్వంగా అందించాల్సిన ముఖ్యమైన సంపద అని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డిలు అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి మాతృభాష ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, అంగన్‌వాడీ టీచర్లు అనిత, హెల్పెర్ సంగీత, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.
- మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 21:

ఎంబీఏ వన్ టైం పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ వన్ టైం పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఆ (నాన్ సీబీసీఎస్) కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

పెళ్లి పేరుతో మోసం..

వెంగళరావునగర్,ఫిబ్రవరి 21 :పెండ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి శారీరక కోరికలు తీర్చుకుని చివరకు మోసం చేసిన ప్రబుద్ధుడిపై ఎస్.ఆర్.నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రమంజిల్ ప్రాంతానికి చెందిన యువతి(30)కి ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఉంటుంది. అమీర్‌పేట ప్రాంతంలోని ఓ డెంటల్ క్లినిక్‌లో వైద్యుడికి సహాయకురాలిగా పనిచేస్తుంది. కాగా 3 సంవత్సరాల కిందట ఆమె నివసిస్తున్న ప్రాంతానికి చెందిన రాజు(25) పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానని, పెండ్లి